ఆంధ్రజ్యోతి



జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 8 జనవరి 2025



సార్లూ.. సిలబస్ ఎట్లా?

- సమగ్ర శిక్షా సమ్మె కాలంలో నష్టపోయిన విద్యార్థులు
- ప్రభుత్వ మొండి వైఖరిపై ఉద్యోగుల పట్టు వీడని పోరు
- అటకెక్కిన చదువులు
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టని అధికారులు
- స్టూడెంట్స్‌లో టెన్షన్.. ఫలితాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన

భూపాలపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మొండి వైఖరి, పట్టు వదలని ఉద్యోగుల పోరు.. భావి పౌరుల విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపింది. తమ హక్కులను సాధించుకొనేందుకు సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనగా చదువులు అటకెక్కాయి. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల సిలబస్‌పై తీవ్ర ప్రభావం పడింది. అధ్యాపకులు, ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడంతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారే కరువయ్యారు. ఈ క్రమంలో విద్యా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పరీక్షలు సమీపిస్తున్న వేళ సిలబస్ ఎలా పూర్తవుతుందనే ఆందోళన వారిలో నెలకొంది.

సమ్మెలో 'సమగ్ర' ఉద్యోగులు

గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌కు వచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి ఉంటే టీ తాగినంత సేపట్లో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ఆయన ముఖ్యమంత్రి అయి ఏడాది పూర్తయినా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిసెంబరు 6న ఆందోళనకు దిగారు. వెంటనే సమ్మె బాట పట్టారు. ఆ రోజు నుంచి జనవరి 6 వరకు నెల రోజులపాటు ఈ సమ్మె కొనసాగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో కాస్త శాంతించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెకు స్వల్ప విరామం ఇస్తున్నట్టు ప్రకటించారు. అయితే.. ఈ నెల రోజులు చేసిన సమ్మెలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది విద్యా శాఖలో పనిచేస్తున్న వారే ఉన్నారు. పైగా కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పనిచేస్తున్న వారే అధికం. ఈ విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఉన్నారు. దీంతో పాటు అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాల కూడా ఉంది. ఈ నేపథ్యంలో వీరికి సిలబస్ పూర్తిగా ఆగిపోయింది.

సమీపిస్తున్న పరీక్షలు

టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు జరుగనుండగా, ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే.. వీరికి సిలబస్ సాధారణంగానే పూర్తి చేయడానికి ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కాలం సరిపోదు. ప్రభుత్వ సెలవులు, ఇతర సమ్మెలు, బంద్‌లతో తీవ్ర అంతరాయం కలుగుతుంది. అలాంటిది సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె బాటపట్టడంతో పాఠాలు బోధించే వీలులేకుండా పోయింది. దీంతో సిలబస్ మరింత కుంటుపడింది. ఇప్పుడు అత్యధిక సమయాన్ని కేటాయించుకోవడానికి ఉపాధ్యాయులు సుముఖంగా ఉన్నారా.. లేదా? అనే విషయాన్ని విద్యాశాఖ అధికారులు గుర్తించాల్సి ఉంది. లేకపోతే విద్యార్థుల ఫలితాలపై వేటు పడకతప్పదనే విమర్శలు లేకపోలేదు.


851 మంది విద్యార్థులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 మండలాల్లో 11 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. భూపాలపల్లి పట్టణంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాల కూడా ఉంది. కేజీబీవీల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్య 370 ఉండగా, ఇంటర్మీడియట్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో 255 మంది, ద్వితీయ సంవత్సరంలో 226 మంది ఉన్నారు. మొత్తంగా 851 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా సిలబస్ పూర్తికాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమ్మె ప్రభావం వీరిపై ఎక్కువగా పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరితో పాటే అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులపై కూడా పడింది. కారణమేమింటే.. వీరంతా సమగ్ర శిక్ష ఉద్యోగులే కావడం. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించామని చెబుతున్నా విద్యార్థులకు అది అందని ద్రాక్షలా తయారైందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క వంట వారు మినహా ఎవరూ విధులకు హాజరుకాలేదు.

ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం..

- రాజేందర్, భూపాలపల్లి డీఈవో

సమ్మె కాలంలో విద్యార్థులు నష్టపోకుండా స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం. అలాగే ఇప్పుడు కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టి సిలబస్ పూర్తయ్యేలా చేస్తాం. ఇప్పటికే 85శాతం సిలబస్ పూర్తయినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.





మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు

- గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
- నిరుద్యోగులు ఉన్నతంగా రాణించాలి
- పోలీసులు మానసికంగా దృఢత్వం కలిగి ఉండాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క



పోచాపూర్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి

మేడారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అందులో భాగంగానే మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. తాడ్వాయి మండలం కొడిశాల, పోచాపూర్, బందాల, లింగాల, బొల్లెపల్లి గ్రామాల్లో మంత్రి సీతక్క మంగళవారం పర్యటించారు. రూ. 12.10 కోట్లతో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొడిశాల నుంచి పోచాపూర్‌కు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 4.10కోట్లు, పోచాపూర్ నుంచి బందల వరకు రూ. 3.80కోట్లు, లింగాల నుంచి బొల్లెపల్లి గ్రామం వరకు రూ. 4.20కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ. 25లక్షలతో వైద్య ఆరోగ్య ఉపకేంద్రం, రూ.40లక్షలతో పోచాపూర్ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోచాపూర్‌లో ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా ఆధ్వర్యంలో డీపీవో దేవరాజ్ అధ్యక్షతన ప్రజా దర్బార్ జరగ్గా మంత్రి సీతక్క గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా అటవి శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజ్, ఆర్టీసీ డీఎం జోత్న్స, ఇన్‌చార్జి తహసీల్దార్ జగదీశ్, కాంగ్రెస్ నాయకులు బొల్లు దేవేందర్, లచ్చుపటేల్, సునీల్, పులి సంపత్, సాంబయ్య, ఇరుసవడ్ల వెంకన్న, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు లక్ష్యాలను సాధించాలి

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులు కష్టపడి పైకి ఎదిగి లక్ష్యాలను సాధించాలని మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఈజీఎంఎం సంస్థల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమం జరగగా మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు కంపెనీల సహకారంతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి ములుగు జిల్లాలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఇదే తరహాలో గత సంవత్సరం జూలైలో జాబ్‌మేళా నిర్వహించినట్టు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించినట్టు

మిగతా 8వ పేజీలో...

మేడారంలో పనులు శాశ్వతంగా నిలవాలి

- భక్తులకు అసౌకర్యం కలగొద్దు
- మినీ జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క సమీక్ష

వివరాలు 7వ పేజీలో..



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు

- అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. కొయ్యూర్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన 108 అంబులెన్స్‌ను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ప్రారంభించారు. అలాగే యాస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ సీఎస్ఆర్ నిధులతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ఎలక్ట్రానిక్ స్కూటీలను పంపిణీ చేశారు. మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అత్యవసర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని అన్నారు. అందులో భాగంగానే కొత్తగా మరిన్ని 108 అంబులెన్స్‌లను అందుబాటులోకి తెస్తోందని తెలిపారు. అంగన్‌వాడీలో మెరుగైన సౌకర్యాలను కలిపిస్తున్నామన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. కొయ్యూర్ గ్రామంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి సోదరి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఎంహెచ్‌వో మధుసూదన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మాజీ ఎంపీపీ మల్హ ల్‌రావు, నాయకులు ఐత రాజిరెడ్డి, జంగిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి భద్రత సమష్టి బాధ్యత : ఆర్టీవో

గణపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత సమష్టి బాధ్యత అని రోడ్డు రవాణా శాఖాధికారి (ఆర్టీవో) సమ్మానీ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని చెల్పూరులో ఆటో యూనియన్, మోటార్ సైకిల్ వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ఓవర్ స్పీడ్, ఓవర్ టేకింగ్‌లు చేయొద్దని అన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రఫీ, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మల్లిపల్లిలో పర్యటించిన జిల్లా ఎపిడమిక్ టీం

కాటారం, జనవరి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలోని మల్రిపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎపిడమిక్ టీం స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించింది. గ్రామంలో ఒకరికి మలేరి యా పాజిటివ్ రావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమై నియంత్రణ చర్యలకు చేపట్టారు. వెద్యశిబిరం నిర్వహించి పలువురు జ్వరపీడితులకు రక్త పరీక్షలు చేశారు. దోమలు వ్యాప్తిచెందకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇల్లిల్లూ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఎపిడమిక్ టీం సభ్యులు రమేష్ కు మార్, పరమేశ్వర్, గోపికృష్ణ సతీష్, హెచ్‌ఏ రాజు, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

ఎల్కేశ్వరంలో ఉద్రిక్తత

- చిన్న కాళేశ్వరం మెయిన్ కెనాల్ పనులను అడ్డుకున్న రైతులు
- పరిహారం ఇచ్చాకే మొదలు పెట్టాలని డిమాండ్
- భారీ పోలీసు బందోబస్తు మధ్య పనుల ప్రారంభం
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ

6



పనులను అడ్డుకుంటున్న రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కేటీపీపీ పునఃప్రారంభం

గణపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అధికారులు పునఃప్రారంభించారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సౌధా ఆదేశాలతో నవంబరు 16న ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేశారు. టర్బైన్, జనరేటర్, బాయిలర్, ట్యూబ్స్ వివిధ విడిపరికరాలను సుమారు 52 రోజులపాటు పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు మంగళవారం పూర్తి కావడంతో రెండో దశ గ్రిడ్లకు విద్యుత్‌ను అనుసంధానం చేసినట్లు ఇంజనీరింగ్ వర్గాలు తెలిపాయి.



కేటీపీపీ వ్యూ



కావేరి జ్యోతికి సింగిడి యంగ్ అవార్డు

మహదేవపూర్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : కాంబోడియా దేశంలో పారాత్రోబాల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన పలిమెల మండల కేంద్రానికి చెందిన నిరుపేద యువతి కావేరి జ్యోతికి సింగిడి యంగ్ అవార్డు లభించింది. 6వ సింగిడి యంగ్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమెకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం జరిగింది.

← అవార్డు అందుకుంటున్న కావేరి జ్యోతి

క్రైం కార్నర్

చిన్నారిపై యువకుడి అఘాయిత్యం

మహాముత్తారం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల చిన్నారిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సం ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో వెలుగు చూసింది. ఎస్సై మహేం దర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని ఓ గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు ఎల్లది సురేష్ అదే గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నా రిపై లైంగిక దాడి చేశాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా చిన్నారి ఒంటరిగా ఉండటాన్ని చూ సి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న ఆ బాలిక రెండు రోజుల తర్వాత ఈ విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

'వైరస్' అలర్ట్!

'హెచ్‌ఎంపీవీ'పై వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం

- ప్రాణాంతకం కాదంటున్న వైద్యులు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు
- దేశంలో కేసులు నమోదైన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు



వివరాలు 7వ పేజీలో...

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భూపాలపల్లిటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో భూపాలపల్లి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీలు సికింద్రాబాద్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరగ్గా జిల్లా నుంచి 62 మంది పాల్గొన్నారు. వీరిలో 54మంది విజేతలుగా నిలిచినట్లు అబాకస్ శిక్షకులు రాణి, వంశీ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్షల్లో వరేణ్య చాంపియన్‌గా నిలవగా ప్రతిష్ఠాత్మకమైన శ్రీనివాస రామానుజన్ అవార్డును ప్రేమర్షిత్, మనోహర్‌రావు, వర్షిత్, శ్రీహాన్, కార్తికేయ అందుకున్నట్లు తెలిపారు. చెల్పూరులోని డీఏవీ స్కూల్ కి చెందిన ఐదు సంవత్సరాల హితాన్ష వరల్డ్ వైడ్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు.



అబాకస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు



సీసీ రోడ్డు పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపడుతున్న మోడల్ కూరగాయల మార్కెట్ నిర్మాణం, శ్రీపాదకాలనీలో రూ.10లక్షల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సైడ్ డ్రెయిన్లు, జాతీయ రహదారి నుంచి అయ్యప్పగుడి వైపు వెళ్లే దారిలో రూ.15లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఆదర్శ హైస్కూల్‌లో నిర్వహించిన డివిజన్‌స్థాయి క్రీడోత్సవ్-2025 బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్య, వైద్యా రంగాలకు పెద్ద పీట వేస్తున్నదన్నారు. రైతులు, మహిళలు, కూలీలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మంథని నియోజకవర్గంలో అన్ని రకాల విద్యాలయాలను స్థాపించి సరస్వతీ నిలయంగా మారుస్తానని ఉద్ఘాటించారు. కాటారం ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాలను తెస్తామన్నారు. ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం, మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన మంత్రి శ్రీధర్ బాబును ఈ సందర్భంగా స్థానిక షటిల్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. ట్రస్మా ప్రతినిధులు మంత్రిని పూలమాలలు, శాలువా, మెమొంటోతో సత్కరించారు. పలువురు తమ సమస్యలపై మంత్రికి వినతి పత్రాలిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈలు సాయిలు, శేషగిరి రావు, ట్రస్మా ఏరియా కమిటీ ప్రతినిధులు కొట్టె శ్రీశైలం, జనగామ కార్తీక్ రావు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్‌రావు, వలుస వెంకటేశ్వర్లు, వెంకటేష్‌గౌడ్, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, మంజుల, కాంగ్రెస్ నేతలు, కూరగాయల వ్యాపారులు, అయ్యప్ప దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో సీఐ నాగార్జునరావు, ఎస్సైలు అభినవ్, నరేష్, హేమలత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

మరిపెడ పీఈటీకి బంగారు పతకం

మరిపెడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ పీఈటీ రాజకుమారి రాష్ట్ర స్థాయి నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో బంగారు పతకం సాధించింది. ఆమెను ఆ స్కూల్ హెచ్ఎం అనంతరావు, టీచర్లు, విద్యార్థులు మంగళవారం మరిపెడ హైస్కూల్లో సత్కరించి జాతీయస్థాయి పోటీలలో సైతం గోల్డ్ మెడల్ సాధించాలని వారు ఆకాంక్షించారు.



బంగారు పతకంతో పీఈటీ రాజకుమారి

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జనవరి 4, 5వ తేదీలలో జరిగిన ఈ పోటీలలో 100మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్‌లో బంగారు పతకం అందుకోగా, ట్రిపుల్ జంప్‌లో రజత పతకం సాధించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు కేరళ రాష్ట్రంలోని తిరుచూరు స్కూల్లో జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఆమె ఎంపికైంది.

ఎల్కేశ్వరంలో ఉద్రిక్తత

- చిన్న కాళేశ్వరం మెయిన్ కెనాల్ పనులను అడ్డుకున్న రైతులు
- పరిహారం ఇచ్చాకే మొదలెట్టాలని డిమాండ్
- భారీ పోలీసు బందోబస్తు మధ్య పనుల ప్రారంభం
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ

మహదేవపూర్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : చిన్నకాళేశ్వరం మెయిన్ కెనాల్ పనులను ఎల్కేశ్వరానికి చెందిన రైతులు మంగళవారం మరోమారు అడ్డుకున్నారు. తమ భూములకు పరిహారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారంటూ ఆందోళనకు దిగారు. పరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పోలీసులు అక్కడికి చేరుకోగా కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారీ పోలీసు బందోబస్తు నడుమ పనులు ప్రారంభించగా రాళ్లబండి కవిత అనే మహిళ అడ్డుకుంది. తమ భూమికి చట్టపరంగా రావాల్సిన పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో అక్కడే ఉన్న మహిళా ట్రైనీ ఎస్సైలు అడ్డుకొని ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే.. తమపై పెట్రోలు పోసేందుకు ఆ మహిళ యత్నించడంతోనే ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు ఆర్ల ప్రసాద్ అధికారులను అడ్డుకుంటుండగా అతడిని పోలీసులు పీఎస్‌కు తరలించారు. తాను గర్భిణి అని, తన ఎదుటే తన భర్తను కర్కశంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు తనను భయాందోళనకు గురిచేశారని ప్రసాద్ భార్య కన్నీటి పర్యంతమైంది.



పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం

అసలు అలైన్‌మెంటే మార్చేశారు..

కెనాల్ కోసం 2012లో ఇచ్చిన అలైన్‌మెంట్‌కు ప్రస్తుతం పనులు చేపట్టిన అలైన్‌మెంట్ పూర్తిగా భిన్నంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం భూములు కోల్పోతున్న రైతులు 20 ఏళ్లుగా సాగు చేసుకుంటుంటే ఆభూములు ప్రభుత్వానికి చెందిన బంజరాయి భూములుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో పరిహారం ఇచ్చిన కెనాల్ అలైన్‌మెంట్ ప్రకారం కొంత మంది రైతులకు సంబంధించి ఐదు గుంటలకు పరిహారం ఇచ్చినట్టు రికార్డులు చూపిస్తుండగా ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం అదే రైతులకు 30 నుంచి 40గుంటల మేర భూమిని కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణ, పరిహారానికి సంబంధించి క్లారిటీ ఇచ్చేంత వరకు పనులు చేపట్టొద్దని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోమారు మోఖా సర్వే నిర్వహించి అసలు రైతులకు, ప్రస్తుతం భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని అంటున్నారు. పరిహారం ఇవ్వకుండా పనులు ప్రారంభించాలని చూస్తే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ బందోబస్తు నడుమ

కెనాల్ పనులను అడ్డుకోనేందుకు రైతులు ఒక్కొక్కరిగా వస్తుండడంతో పోలీసులు అదనపు భద్రతా సిబ్బందిని దింపారు. మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో కాళేశ్వరం, మహదేవపూర్, పలిమెల ఎస్సైలతో పాటు సుమారు 30మంది సిబ్బంది మోహరించారు. దీంతో ఎల్కేశ్వరంలో రెండు గంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. ఇదిలా ఉంటే గతంలో భూమి కోల్పోవడంతో అవార్డు పొందిన వారి వివరాలు ఇవ్వాలంటూ రైతులు మొండికేయడంతో రెవెన్యూ అధికారులు క్లారిటీ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇరిగేషన్ అధికారుల నుంచి సైతం స్పష్టత ఇవ్వాలని కోరడంతో ఇరిగేషన్ అధికారులు అక్కడికి రాకుండానే వెనుదిరిగారు. ప్రాజెక్టుకు తాము అడ్డుకాదని, పరిహారం ఇచ్చి పని చేసుకోవాలంటున్నా ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెవెన్యూ మాయ!

కెనాల్ కోసం భూములు కోల్పోతున్న రైతులు సాగు చేసుకుంటున్న భూములు పోరంబోకు భూములని, 2012లోనే వారికి ఇచ్చిన అసైన్‌మెంట్లు రద్దు చేసి భూమిని స్వాధీనం చేసుకున్నామని రెవెన్యూ అధికారులు అంటున్నారు. రైతులకు అర్హతలను బట్టే పరిహారం ఇచ్చామని చెబుతున్నారు. అయితే.. అవే సర్వే నెంబర్లలో అదే భూమిలో 20 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామని రైతులు అంటున్నారు.

ఆ భూమిలోనే మోటారు కూడా ఉందంటూ 20 ఏళ్లుగా చెల్లించిన విద్యుత్ బిల్లులు సైతం చూపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆ భూములకు సంబంధిచి పాత పట్టా పాస్ బుక్కులతో పాటు ధరణిలో వచ్చిన పట్టా బుక్కులు కూడా తమ వద్ద ఉన్నాయని అంటున్నారు. ఈ పట్టా బుక్కులు సంగతేమిటని రైతు లు రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా అవి ఎలా వచ్చాయో తెలియదని చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల జరిగిందని చెప్పుకొచ్చారు. కాగా కెనాల్ పనులకు సంబంధించి పరిహారం లేదా మోఖా సర్వే చేశాకే పనులు చేపట్టాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ ఫొటోగ్రఫీలో డప్పు యానికి ప్రథమ బహుమతి



ఒడిశాలో హుస్సేన్‌ఖాన్ నుంచి బహుమతి అందుకుంటున్న డప్పు యాని



డప్పుయాని తీసిన ఫొటో

మహబూబాబాద్ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఏడో జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన డప్పు యానీ ప్రథమ బహుమతిని సాధించారు. మల్కన్‌గిరిలో ఈనెల 5,6 తేదీల్లో ఖమ్మంనకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ హుస్సేన్‌ఖాన్ ఆధ్వర్యంలో ఒడిస్సా రాష్ట్రంలోని బోండా తెగ వారి జీవన విధానంపై వర్క్‌షాపు, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న యానీ తీసిన ఫొటోకు ప్రథమ బహుమతి వరించింది. మంగళవారం జాతీయ స్థాయి పోటీల నిర్వాహకులు, హుస్సేన్‌ఖాన్ చేతుల మీదుగా యానికి ప్రశంసాపత్రంతో పాటు మెమెంటోను అందజేశారు.

బాలికపై అత్యాచారం

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికపై వివాహిత యువకుడు అత్యాచారం చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో అలస్యంగా వెలుగు చూసింది. సీఐ బాబురావు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వివాహిత యువకుడు గోవిందు సతీష్ సాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలిక(16)ను శనివారం రాత్రి మాయ మాటలు చెప్పి ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై గ్రామ సమీపంలోకి తీసుకెళ్లి బాలికను బెదిరించి అత్యాచారం చేశాడు. రైతులు గమనించడంతో బాలికను అక్కడే వదిలిన సతీష్ బైక్‌పై పారిపోయాడు. బాలికను గుర్తించిన రైతు ఆమెను ఇంటికి తీసుకువచ్చి వదిలివెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అత్యాచారం, ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సతీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ బాబురావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి వాగు సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి ఎస్ఎం గ్రామానికి చెందిన మోతే సాంబయ్య (55) వ్యవసాయంతో పాటు ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు మోటారు రిపేరు చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సాంబయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సాంబయ్య మృతదేహం

గవర్నర్ దత్తత గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

కొండపర్తి ప్రగతిపై ప్రిన్సిపల్ సెక్రటరీ

ములుగు కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, ఇప్పటికే చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకరను గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఆదేశించారు. రాజ్‌భవన్ నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొండపర్తి గ్రామంలో మౌలిక సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై దృష్టి సారించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు బోధన అందుతోందని, ఇందుకు సహకారం అందించేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని తెలిపారు. పాఠశాల భవన నిర్మాణం పూర్తి కావస్తోందన్నారు. రెడ్‌కో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎల్ఈడీ బల్బులను అమర్చినట్టు చెప్పారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర



పాఠశాల పీఈటీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి పోటీలకు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలో ఈనెల 5 రాష్ట్రస్థాయి ఐదు కిలోమీటర్ల నడక విభాగంలో తృతీయస్థానం సాధించిన కంబాలపల్లి పాఠశాల పీఈటీ మహంకాళి వెంకటేశ్వర్లు జాతీయస్థాయి నడకపోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరిలో కేరళలో జరిగే జాతీయస్థాయి నడక పోటీల్లో వెంకటేశ్వర్లు పాలొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వెంకటేశ్వర్లును పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎస్.రమేష్‌బాబు, విష్ణువర్ధన్, ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాసరావు, సతీష్‌రెడ్డి, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, తిరుపతి, కవిత సన్మానించారు.

వెంకటాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు అవార్డు

వెంకటాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డు లభించింది. 2024లో పాఠశాల పనితీరు, ఉత్తీర్ణత శాతం, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థుల ప్రగతికి చేపడుతున్న చర్యలు, పాఠశాల వాతావరణం, పచ్చదనం పరిశుభ్రత, తరగతిగదులు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, విద్యార్థులకు మినరల్ వాటర్ సౌకర్యం, నీటి వసతితో కూడిన బాలబాలికలకు వేర్వేరు మరుగుదొడ్ల ఏర్పాటు, ఇంటర్నెట్ వైఫై సౌకర్యం, కిచెన్‌గార్డెన్, మధ్యాహ్న భోజనం కోసం గ్యాస్ పొయ్యిలు, విద్యార్థులు క్రీడల్లో రాణింపు, జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ వంటి వాటిలో ఉత్సాహంగా పాల్గొనడం, ట్రిపుల్ ఐటీ బాసరలో రెండు సీట్లు సాధించడం, తదితర అంశాల్లో రాణిస్తున్న నేపథ్యంలో ఈ పురస్కారాన్ని అందించారు. ఈసందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శాంతా బయోటిక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మల్లారెడ్డి, విద్యాపీఠ్ వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి, ఎస్‌సీఆర్‌టీ రాధారెడ్డి నుంచి హెచ్ఎం బాబూరావు అవార్డును అందుకున్నారు.



ఎక్సలెంట్ అవార్డు అందుకుంటున్న హెచ్ఎం బాబూరావు

జాతీయస్థాయి పోటీలకు గణేష్

తొర్రూరు రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలం చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జాటోత్ గణేష్ జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం. ఎం.బుచ్చయ్య తెలిపారు. మంగళవారం హెచ్.ఎం మాట్లాడుతూ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌ను హెచ్ఎం, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తనూజ, జయపాల్‌రెడ్డి, కృష్ణ, యాకూబ్‌ఆలీ, ఉపేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కవిత, రాధాబాయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి గణేష్

మాజీ సర్పంచ్ భర్త వేధింపులు

- దూషించాడంటూ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జేపీఎస్‌లు

నర్సింహులపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ తీర్మానాలు, పెండింగ్ బిల్లులు ఇవ్వాలంటూ మాజీ సర్పంచ్ భర్త ఓ పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో బెదిరించి వేధిస్తున్నాడని, అసభ్యపదజాలంతో దూషించాడని మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. గోల్‌బోడ్యాతండా పంచాయతీ కార్యదర్శి భూక్య సుధాకర్ జీపీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మాజీ సర్పంచ్ భర్త బాదావత్ కిషన్‌నాయక్ ఫోన్‌చేసి తనకు పనుల తీర్మానాలు.. గ్రామ పంచాయతీ నుంచి నిధులు రావాలి.. తక్షణమే ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గతంలో జీపీ నుంచి అడ్వాన్స్‌గా రూ.2.20 లక్షలు తీసుకున్న విషయం గుర్తుచేసి, రికార్డులు సైతం ఇవ్వలేదని అడగడంతో బండబూతులు తిడుతూ అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిపారు. కిషన్ నాయక్‌తో ప్రాణభయం ఉన్నదని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలపడంతో తోటి పంచాయతీ కార్యదర్శులు మద్దతు తెలిపి సంఘీభావం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కర్యదర్శులు ఉన్నారు.

నాలుగు కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

మహబూబాబాద్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైలు ఎక్కేందుకు వెళ్తున్న ఇరువురి వద్ద ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రామమందిరం సెంటర్ వద్ద మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఒడిస్సా రాష్ట్రం జాద్‌పూర్ జిల్లా, జనక గ్రామానికి చెందిన నిషికాంత స్వైన్, అదే జిల్లాకు చెందిన సత్యజిత్ స్వైన్‌లు సిద్ధంగా ఉన్నారు. వీరిని పక్కా సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు లక్ష విలువ గల 4 కిలోల ఎండు గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

నిషికాంత్, సత్యజిత్ స్వైన్‌లు ఒడిశా నుంచి రెండు రోజుల క్రితం గంజాయి తీసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో సోమవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులను చూసి రైలు దిగి మహబూబాబాద్‌లోనే ఉన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వెళ్తున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు సురేందర్, మోహన్, వీరన్న, రమేష్‌చంద్ర, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహులపేటలో దొంగల బీభత్సం

- భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు అపహరణ
- పోలీసుల అదుపులో అనుమానితులు

నర్సింహులపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఓ ఇంట్లో మంగళవారం తెల్లవారు జామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో తాళం పగలగొట్టి భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. ఎస్సై ఎం. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహులపేటకు చెందిన ఎరనాగి రవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో దాచి ఉంచిన రూ.12లక్షలు నగదు, సుమారుగా 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీఎస్ సీఐ హత్తిరాం, మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీసీఎస్ ఎస్సై తహెర్‌బాబా, ఎస్సై సురేష్ పర్యవేక్షణలో క్లూస్ టీం అధికారుల బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. నర్సింహులపేటలో చోరీ జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే ఇద్దరు అనుమానితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి క్షేత్రస్థాయి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా నిందితులు అదుపులోకి తీసుకున్న మాట వాస్తవమే అన్నారు.



చోరీ జరిగిన ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం అధికారులు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2110	2045
పల్లికాయ (సూక)	6500	5600
పల్లికాయ (పచ్చిది)	4850	4500
కందులు	7166	5560
పెసళ్లు	7059	4000
పత్తి	7155	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	11559	10235
పసుపు (గోల)	11565	10432
తేజ మిర్చి	13500	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్ 341ఏసీ	14000	11000
యూఎస్ 341కొత్తది	14000	12500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



WANTED
★ Wanted Teacher & Telecallers. All Subjects to Teach Upto 7th Class Part Time/ Full Time Bheemaram, Near KUC, Hnk. Contact : 9849157056
AJW-226007

WANTED TELECALLERS
★ Urgnet Requirement for ICIC, HDFC, AXIS, INDUSIND BANKS. DSA Personal Loans Experience and fresher female Tele-Callers Salary+Incentives Job Location Hanamkonda. Contact : +91 9398286149
AJW-7635

WANTED
★ యూట్యూబ్ చానెల్ నందు పని చేయుటకు 20 మంది (Female's) కావలెను. సుబేదారి, హన్మకొండ. సం॥ప్ర॥ 8897361521
AJW-226008

WANTED
★ వరంగల్ ట్రైసిటీస్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన డ్రైవర్ ఉన్నాడు. సంప్రదించాల్సిన. ఫోన్. నెం : 9849367591
AJW-226013

CHANGE OF NAME
★ I, GUDEPU MAHENDER, H.NO: 1-76, Mylaram, Shayampet, Hanumakonda, T.G., Have Changed My Minor Daughter Name from GUDEPU AMMULU (Old Name) to GUDEPU RASAGHNA (New Name) for all Purposes
AJW-226014

CHANGE OF NAME
★ I, TAKKALAPALLI DAMODAR RAO W/O. TAKKALAPALLI DAMODAR RAO R/O. H.NO 2-128, VILL: ASHALAPALLY, MANDAL: SANGAM, DIST: WARANGAL RURAL. DECLARE THAT I, CHANGED MY NAME FROM TAKKALAPALLI DAMODAR RAO TO TAKKALAPALLI SAROJANA
AJK-16377

PLOT FOR SALE
★ రాఘవపూర్ (V) స్టేషన్‌ఘన్‌పూర్ (M) సర్వే.నెం.53 & 54 మేయిన్ రోడ్ వరంగల్ వైపు 299 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సం॥ప్ర॥ 8106523236
AJW-226353

HOUSE FOR SALE
★ వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq.Yrds పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మబడును. సం॥ప్ర॥ 8331888842
AJW-226410

REAL ESTASTE
★ బీబీనగర్, ఘట్‌కేసర్, షాద్‌నగర్ ఏరియాలో ప్లాట్స్ అమ్మబడును, కొనబడును. సెల్: 9505032103
AJH-002998

ఓపెన్ ప్లాట్లు అమ్మబడును
★ జనగామ జిల్లాలో హైదరాబాద్-వరంగల్ హైవే పై శ్రీ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా శ్రీ సత్యసాయి A/C వెంచర్ హోటల్ ఆనుకొని ఉన్న వెంచర్‌లో క్లియర్ టైటిల్ గల విల్లా ప్లాట్లు అమ్మబడును. సం॥ప్ర॥ 8500823123.
AJW-226359

TO-LET
★ దేశాయిపేట రోడ్, టీచర్స్ కాలనీ, DNL రెసిడెన్సియల్‌లో కమర్షియల్ షెటర్ దానిని ఆనుకొని Single Bed Room గలది అతి తక్కువ రెంట్‌తో అద్దెకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ సౌకర్యం కలదు. సం॥ప్ర॥ 94407 21207
AJK-218273

ఉచిత కంప్యూటర్ శిక్షణ
★ UICT మహబూబాబాద్ & Wgl ఉమ్మడి జిల్లాలలో Hardware & Software నూతన సం॥ ఆఫర్ కోర్సులు ఉచిత శిక్షణ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే. సం॥ప్ర॥ 9966343485
AJW-5759

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232



వైరస్ అలర్ట్!

హెచ్ఎంపీవీ వ్యాధిపై వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం


- దేశంలో కేసులు నమోదైన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సలహాలు



వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటాన్యూమో (హెచ్ఎంపీవీ) వైరస్.. ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతోంది. చైనాలో ఈ వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, మన దేశంలోనూ బెంగళూరు, గుజరాత్, చెన్నైల్లో ఐదుగురు చిన్నారులు ఈ వైరస్ బారిన పడిన విషయం వెలుగులోకి రావడం.. పైగా ఆ బాధితుల్లో ఎవరూ విదేశాలు వెళ్లిన వారు లేకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొవిడ్ కాలం నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణతో పాటు బాధితులకు అందించాల్సిన వైద్యసేవలపై దృష్టిపెట్టాయి. ఇదే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. అన్ని ఆసుపత్రుల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. ఓ వైపు ప్రజలను అప్రమత్తం చేస్తూనే జాగ్రత్తలు చెబుతున్నారు. ఈ వైరస్ గురించి భయపడాల్సింది ఏమీ లేదని ధైర్యాన్ని ఇస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 24గంటల ఆస్పత్రులు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లోని డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో హెచ్ఎంపీవీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విదేశాల నుంచి ఉమ్మడి జిల్లాకు వస్తున్నవారిపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. సాధారణంగా ఉమ్మడి జిల్లా నుంచి చైనా, తదితర దేశాలకు వెళ్లే వారు ఎక్కువ సంఖ్యలోనే ఉండటంతో.. ఇటీవల కాలంలో చైనా నుంచి వచ్చిన వారెవరైనా ఉన్నారా? అని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రాణాంతకం కాదు.. భయపడొద్దు అంటున్న వైద్యులు

కరెంట్ టాపిక్



ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం..



దేశంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఐసోలేషన్‌వార్డుల ఏర్పాటు లాంటి వాటిపై ప్రాథమిక సూచనలు చేశాం. ఈ వైరస్ ప్రాణాంతకమైంది కాకపోయినా దీని బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రతీ ఒక్కరు మాస్కులు ధరించాలి. కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు ఇప్పుడు కూడా పాటిస్తే మరీ మంచిది.

- డాక్టర్ అప్పయ్య, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

ఆందోళన అవసరం లేదు..

హెచ్ఎంపీవీకి వ్యాక్సిన్ లేదు. కరోనా సమయంలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు హెచ్ఎంపీవీని గుర్తించడానికి ఎలాంటి పరీక్షలు లేవు. ఇంత వరకు ఈ వ్యాధిని నయం చేయడానికి తగిన ఔషధాలు కూడా లేవు. ఈ వైరస్ మరింత బలపడితే తీవ్ర ప్రభావం చూపే అవకాశాలుండటంతో అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు, ఆస్పత్రుల సూపరింటెండెట్లకు రాష్ట్ర వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. దాంతో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో వైద్యులు హెచ్ఎంపీవీ పై దృష్టి సారిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ఇప్పటి వరకు హెచ్ఎంపీవీ సంబంధిత కేసులు నమోదు కాకపోవడంతో ఊరటనిచ్చే అంశమని, అయినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఇది ప్రాణాంతకం కాదని, భయపడాల్సిన అవసరం లేదు... కానీ గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశమున్న నేపథ్యంలో మాస్కులు ధరిస్తే మంచిదని, శానిటైజర్ వాడటం, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ప్రచారం చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి త్వరగా ఈ వైరస్ సోకుతుందని, కీమోథెరపీ, అవయవ మార్పిడి చేసుకున్న వారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పులు లాంటివి తీవ్రంగా ఉంటే ఆందోళన చెందకుండా వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఇది కరోనా లాంటి వైరస్ కాదు..



హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) రెండు రకాలు. అది ఏ, బీ. దీనిలో ఆరు జీనో రకాలున్నాయి. దానిలో ఏ2సీ, బీ2 అనే రకాలు అధిక శాతం వ్యాప్తిలో ఉన్నాయి. దీనిలో ఏ2సి ప్రపంచ వ్యాప్తంగా 2018లో 1.10కోటి కేసులకు కారణమైంది. ఈ వైరస్ అంత ప్రాణాంతకమైనది కాదు. జ్వరం, దగ్గు, న్యూమోనియా దీని ముఖ్య లక్షణాలు. ఈ హెచ్ఎంపీవీ వైరస్ ముఖ్యంగా 1 నుంచి 4 యేళ్ల వయసు గల పిల్లల్లో అధికంగా సోకుతుంది. చైనాలో వ్యాప్తి చెందిన ఏ2బీ వేరియంట్ ఏ2సీతో పోలిస్తే తక్కువ తీవ్రత ఉంది. ఇది కరోనాలాంటి వైరస్ కాదు. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ అజిత్ మహ్మద్, సీనియర్ జనరల్ ఫిజీషియన్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి



మేడారంలో పనులు శాశ్వతంగా నిలవాలి

- భక్తులకు అసౌకర్యం కలగొద్దు
- మినీ జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మేడారంలో చేపట్టే ప్రతీ పని శాశ్వతంగా నిలవాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర ఏర్పాట్లపై గట్టమ్మ సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష జరిపారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే జాతరను విజయవంతం చేసేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మినీ జాతర నేపథ్యంలో ముందస్తుగా మేడారానికి భక్తులు వస్తున్నారని, దాంతో 15 రోజులుగా రద్దీ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతులను మెరుగు పర్చాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి భక్తుల రాక అధికమవుతుందని, ఈమేరకు అప్రమత్తం కావాలని అన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జనవరి నెలాఖరుకల్లా లింకురోడ్ల పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. తల్లుల గద్దెలను దర్శించుకునే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దన్నారు. పారిశుధ్య లోపం తలెత్తవద్దని, వీలైనంత ఎక్కువ మంది కార్మికులను నియమించుకోవాలని సూచించారు. జాతర జరిగే ఐదు రోజులపాటు విద్యుత్ సరఫరా నిరంతరాయం కొనసాగాలన్నారు. జంపన్న వాగు వద్ద పుణ్య స్నానాలు చేసిన మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలని, ఉన్నతాధికారులు నిత్యం పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు అయ్యే వ్యయ అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైనన్ని నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ రవీందర్, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, ఆయా శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ద్వార దర్శనంతో విష్ణు కటాక్షం

- ఎల్లుండి వైకుంఠ ఏకాదశి
- ముస్తాబైన ఆలయాలు.. ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఆధ్యాత్మికం



వరంగల్ కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీ శుక్రవారం రోజున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5గంటలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ గీతా భవన్ శ్రీవేంకటేశ్వర స్వామి, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి, భద్రకాళి రోడ్డులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఆకారపు వారి దేవాలయంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రం, శివనగర్‌లోని శ్రీరామాలయం, కరీమాబాద్‌లోని రామస్వామి గుడి, కాశిబుగ్గలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఉదయం అభిషేకాలు నిర్వహించిన అనంతరం అలంకరణలు అర్చనలు పూజలు నిర్వహించి వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు.

పవిత్రం

వైకుంఠ ఏకాదశి అన్ని ఏకాదశిలలో అత్యంత పవిత్రమైనది. ఈ రోజున ఉపవాసం ఉండి శ్రీమహా విష్ణువును ద్వార దర్శనం చేసుకుంటారు. దీనినే వైకుంఠ ద్వార దర్శనమని కూడా అంటారు. వైకుంఠం అంటే విష్ణు నివాసం అని అర్థం. ఈ వైకుంఠ ఏకాదశి రోజున హిందువులు విష్ణువును ఆరాధిస్తే స్వర్గానికి చేరుకుంటామని భావించి ఉపవాస దీక్షతో పూజలు నిర్వహిస్తారు. పురాణాల కాలం నుంచి వైకుంఠ ద్వార దర్శనాన్ని నిర్వహిస్తున్నారు. ద్వార దర్శనం సందర్భంగా ఆలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలను భక్తులు దర్శించుకోనున్న నేపథ్యంలో ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు.

ఆండాళ్ అమ్మవారికి పూజలు, తిరుప్పావై ప్రవచనం

నెల రోజుల పాటు కొనసాగే ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం నిర్వహిస్తారు. ఆ రోజున గోదాదేవి అండాళ్ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుప్పావై ప్రవచనాలు పఠిస్తారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణాలు, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాలు పఠిస్తారు. అనంతరం భక్తులకు పొంగలి, లడ్డూ, పులిహోర ప్రసాదాలను అందిస్తారు.

దశాబ్దాల ఆనవాళ్లు..

గూడూరులో కనువిందు చేస్తున్న భారీ వృక్షాలు



గూడూరు అటవీశాఖ కార్యాలయంలో భారీగా ఉన్న వేప, చింత, రావి చెట్లను చూపిస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బంది

'ఈ చెట్లు మా తాతల కాలం నాటివి.. మా ముత్తాతల కంటే ముందు తరాలకు చెందిన ఈ వృక్షాలు చెక్కు చెదరలేదు.. ఇవి మా అమ్మ తన చిన్నప్పుడు నాటిన చెట్టు..' ఇలాంటి మాటలు మనం తరచూ వింటున్నాం కదా..! కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే చెట్ల వయస్సు మాత్రం మనమెవ్వరం ఊహించలేం కూడా.. వాటి వివరాల్లోకి వెళితే.. గూడూరు అటవీశాఖ కార్యాలయంలో సుమారు 80 ఏళ్ల భారీ వృక్షాలు 8 మీటర్ల వెడల్పుతో భారీ కొమ్మలతో పచ్చని వాతావరణం కల్పిస్తున్నాయి. ఈ భారీ వేప, చింత, రావి చెట్లు అటవీశాఖ సంరక్షణలో సరికొత్తగా చిగురిస్తూ ఆకాశమంతా ఆకుపచ్చ అందాలను పరిచేసింది. ఎండకాలంలో నీడతో పాటు చల్లని వాతావరణాన్ని అందిస్తున్నాయి. చెట్ల చుట్టూ చెదలు, తెగుళ్లు రాకుండా గూడూరు ఎఫ్ఆర్వో సురేష్ సిబ్బందితో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మహా వృక్షాలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

గుర్తుకొస్తున్నాయి..

ఎన్నో జ్ఞాపకాలను తట్టిలేపుతున్న పాత రైలు టికెట్

జ్ఞాపకం

దశాబ్దాల క్రితం వాడిన వస్తువులను చూడగానే ఎవరికైనా నాటి స్మృతులన్నీ కళ్లముందు కదలాడుతుంటాయి. ప్రతీ ఒక్కరు జ్ఞాపకాల్లోకి వెళుతుంటారు. ఇదే తరహాలో కేసముద్రం నుంచి వరంగల్‌కు 2004లో ఉపయోగించిన పాతతరం రైల్వే టికెట్ ఒకటి స్థానిక సామాజిక మాధ్యమాల్లో రెండు, మూడు రోజులుగా చక్కర్లు కొడుతోంది. 1990 దశకంలో నాటి పిల్లలు అట్టముక్కపై ముద్రించి ఉన్న టికెట్లను సేకరించి ఆడుకునేవారు. తిరుపతి, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాలకు వెళ్లిన సందర్భంలో ఆ ప్రయాణానికి సంబంధించిన టికెట్లను ఒక జ్ఞాపకంగా దాచిపెట్టుకునే వారు. నేటి డిజిటల్ యుగంలో కాగితం టికెట్లు, ఈ-టికెట్లు రావడంతో అవన్నీ నేటి తరం వారికి తెలియకుండా పోయాయి. అయితే సోషల్‌మీడియాలో పాతటికెట్ ఒకటి చెక్కర్లు కొడుతుండటాన్ని చూసిన వారంతా 'గుర్తుకొస్తున్నాయి..' అంటూ ఆ తీపి గురుతును తెలిసిన వారందరికీ షేర్ చేస్తుండడం విశేషం.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న కేసముద్రం - వరంగల్ మధ్య రాకపోకలకు 20ఏళ్లనాడు ఉపయోగించిన రైలు టికెట్

'కష్టాల' కల్లాన్ని ఊడ్చి!

- కూటి కోసం తిప్పలు పడుతున్న 70ఏళ్ల లచ్చమ్మ



మట్టి కలిసిన వడ్లను చాటతో చెరుగుతున్న లచ్చమ్మ

ములుగు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నెరిసిన జుట్టు గాలికి చెదిరిపోయింది.. అయినా ఆమె నుదురుపై సింధూరం ధగధగా మెరిసిపోతోంది.. ముడతలు పడ్డ చర్మం ఆమె వృద్ధాప్యాన్ని ఎత్తి చూపుతున్నా.. కష్టాల కల్లాన్ని ఊడేద్చందుకు ఆమె శ్రమిస్తోంది. కల్లంలో పడిన వడ్లగింజలను ఏరుతూ.. మొక్కిలి చీపురుతో ఊడ్చుతూ.. వచ్చిన మట్టిని జల్లెడపట్టి.. చాటతో చెరుగుతూ ధాన్యాన్ని కుప్పలు పోస్తోంది. నడినెత్తిన ఎండ మండుతున్నా ఆమె శ్రమిస్తూనే ఉంది.. ములుగు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం కిందపడిన వడ్లను సేకరిస్తున్న ఆమెను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. 70ఏళ్ల వయసులో కాసిన్ని మెతుకుల కోసం వడ్ల గింజలను పోగుచేసుకుంటున్న ఆ వృద్ధురాలి పేరు రత్న లచ్చమ్మ ఊరు వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి. 'ఎండలో ఎందుకింత కష్టం' అని అడిగితే.. కడుపుతిప్పలకు తప్పదు కదా బిడ్డా..! అని సమాధానం చెప్పింది. ఆమె కళ్లు ఓ వైపు వడ్ల గింజలను వెతుకుతూనే ఉండగా.. తన బరువెక్కిన హృదయంతో తన దీన స్థితిని వెలిబుచ్చింది. 'నా భర్త ఎల్లయ్య. 80ఏండ్లు దాటినై. మంచంలోనే ఉంటడు. నేను పెడితెనే తింటడు. మాకు ఏడుగురు కొడుకులు. ఒక బిడ్డ. మేం ఆకలితో ఎండినా కొడుకులకు మాత్రం ఏ తక్కువ చేయలే. నా బిడ్డ చచ్చిపోయింది. ఏడుగురు కొడుకుల్లో ఒకడు ఇంజనీరు. ఒక కొడుక్కు నౌకరి ఉందని సర్కారు నాకు పింఛిని ఇత్తలేదు. పండగలకు, పబ్బాలకు ఇంటికి వచ్చినప్పుడు నా కొడుకు నాలుగైదు వేలు ఇచ్చిపోతడు.. వాటితో కొన్ని ఖరుసులెల్తయ్. నా భర్త ఎల్లయ్య నేడు పెడితేనే తింటడు. నాలుగేండ్ల సంది వడ్ల కల్లాలను ఊడ్చుకుని దొరికిన వడ్లను అమ్ముకుంటున్నా..' అంటూ కన్నీటి పర్యంతమైంది. ఏడుగురు కొడుకులున్నా ఎవ్వరిపై ఆధారపడకుండా ఏడుపదుల వయసులో మనోనిబ్బరంతో కష్టపడుతున్న ఆమె అందరికీ మార్గదర్శకం. అయితే పదిరోజులుగా లచ్చమ్మ కల్లాన్ని ఊడ్చి 120కిలోల వడ్లను పోగేసింది.

ఐనవోలు జాతరకు సమన్వయంతో పనిచేయాలి

- వీడియోకాల్‌లో మంత్రి కొండా సురేఖ ఆదేశం
- మల్లన్న ఆలయ ఆవరణలో సమీక్ష సమావేశం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే నాగరాజు



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఐనవోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయధర్మదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాల్ ద్వారా ఆదేశించారు. జనవరి 12 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు వివిధ శాఖల ఎజెండా అంశాలను చదివి వినిపించారు. సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. గత జాతర అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీజాతరగా చేయాలనే ఉద్దేశంతో పారిశుద్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ బ్యాగ్‌లు, బాటిల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి, స్క్రోలింగ్ లైన్స్‌ని ఏర్పాటు చేసి వ్యాపారులను, భక్తులను అనౌన్స్‌మెంట్ ద్వారా చైతన్యపరుచాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంత్రిని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం..

జాతరకు భక్తులు లక్షల సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా సకల సౌకర్యాలు కల్పిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే జాతర విజయవంతానికి అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖతోపాటు ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వామ్యం చేసి కమ్యూనిటీ రిసోర్స్ ఫండ్ కింద వారు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త వైరస్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని అవసరమైతే జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని వివరించారు. ఐనవోలుకు వచ్చే రహదారులను తక్షణమే మరమ్మతులు చేయాలని, మూలమలుపులు, వ్యవసాయబావుల వద్ద రేడియంతో కూడిన సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖల ఆధ్వర్యంలో నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. మహిళల కోసం స్నానగదులు ఏర్పాటు చేసి దుస్తులు మార్చుకోవడం కోసం డ్రెస్సింగ్ రూములు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జాతరలో భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులను ఎక్కువమొత్తంలో నడుపాలన్నారు. అగ్నిమాపకశాఖ మినీ వెహికిల్స్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రత్యేక వీఐపీ లైన్ ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు.

జాతరలో అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. జాతర పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. మేడారం తర్వాత ఐనవోలు పెద్ద జాతర ఐనందున కార్పొరేషన్ ద్వారా అన్నివిధాలా సహకరిస్తామన్నారు. పారిశుధ్య సిబ్బంది, ఫాగింగ్ యంత్రం, చెత్త తరలింపునకు డంపర్ బిన్లను అందుబాటులో ఉంచుతామన్నారు.కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జాతర సమయం సమీపిస్తున్నందున ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపులో గ్రేటర్ వరంగల్ మునిసిపల్, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డ్రెస్సింగ్ రూంలు, తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్ర శాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సత్వరమే పనులు చేపట్టి పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కమిషనర్ అశ్విని తానాజి వాకడే మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని కేటాయించి చెత్తను తరలించేందుకు స్వచ్ఛ ఆటోలను సిద్ధంగా ఉంచనున్నట్లు తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు స్వచ్ఛమైన మిషన్‌భగీరథ తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మునిసిపల్ శాఖ అందిస్తున్న సేవలు మరువలేనివని ఎప్పటికీ అలాగే అందించాలని కోరారు.

'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ఐనవోలు ఆలయ ప్రాంగణంలో 'కుడా' ద్వారా ఇప్పటికే పనులు చేపట్టామని, మిగిలిన శాశ్వత నిర్మాణ పనులను జాతర అనంతరం చేపడుతామని హామీ ఇచ్చారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. మల్లికార్జునస్వామి సేవలో భక్తులు... భక్తుల సేవలో పోలీసులు.. నిమగ్నమై సేవలందిస్తారని తెలిపారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తును ఏర్పాటు చేసి నిఘా కళ్లతో పర్యవేక్షిస్తామన్నారు. గత జాతరలో లోపాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా చర్యలు చేపడుతామన్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ ద్వారా జాతరను పర్యవేక్షిస్తామన్నారు.

కాగా, సమీక్ష సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే, మేయర్, కుడా చైర్మన్, జిల్లా కలెక్టర్, అధికారులు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ఏసీ సునిత, ఆర్డీవో రమేష్‌రాథోడ్, డీఎంఅండ్‌హెచ్‌వో అప్పయ్య, డీపీవో రమాకాంత్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
బుధవారం 8 జనవరి 2025

ఆర్థిక ఇబ్బందులతో మేజిక్ వాహనాల యజమాని ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక టాటా మేజిక్ యజ మాని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ... మండల కేంద్రానికి చెందిన బాస నాగరాజు(32)కు ప్రయాణికుల తీసుకెళ్లే రెండు టాటా మేజిక్ వాహనాలు ఉన్నాయి. కొన్ని నెలలుగా వీటి నిర్వహణ సరిగా లేక అప్పులు పెరిగిపోయాయి. దీంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో మనస్తాపం చెందిన నాగరాజు సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి జాతీయ రహదారి పక్కన ఓ ఖాళీ స్థలంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు నాగరాజు కోసం రాత్రంతా చూసిన ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పొలంలో మృతదే హాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతున్ని ఇంటికి తీసుకొచ్చారు. మృతునికి భార్య నవనీత, కొడుకు రణధీర్, కూతురు ప్రియదర్శిని ఉన్నారు. ఆర్టీసీ ఫ్రీ బస్సు కారణంగానే టాటా మ్యాజిక్ వాహనాలు నడవక ఆర్థిక ఇబ్బందుల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకు న్నాడని మృతడి భార్య ఆరోపించింది. వాహనాలు నడవక అప్పులు తీర్చే పరిస్థితి లేక మనోవేదన చెంది నాగరాజు ఆత్మహత్య చేసుకు న్నాడని ఆవేదన వ్యక్తం చేసింది.

పట్టా పాస్‌పుస్తకం తాకట్టు పెట్టాల్సిందే!

కొర్రీలు పెడుతున్న బ్యాంకర్లు • ఇబ్బంది పడుతున్న రైతులు

వెంకటాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందా లంటే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పాస్‌పుస్త కాలు బ్యాంకులో ఉండటంతో చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు భూవి స్తీర్ణం ఆధారంగా పట్టాదారు పాస్‌పుస్తకాల జిరా క్స్‌లు తీసుకుని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. దీంతో బ్యాంకర్లు రుణాల మంజూరుకు జిరాక్స్‌లు తీసుకుని రుణా లు ఇచ్చేవారు. కానీ, నాలుగేళ్ల నుంచి కొత్త నిబంధనలు ఆమల్లోకి రావడంతో రైతులు ఇబ్బం దులు పడుతున్నారు.

కొత్త నిబంధనలతో ఇబ్బందులు

కొత్త నిబంధనల మేరకు సహకార బ్యాంకుల్లో పాస్‌పుస్తకాలు తాకట్టు పెట్టుకుని రుణాలు మం జూరు చేస్తున్నారు. రైతుల వద్ద పట్టాదారు పాస్‌పు స్తకాలు లేకపోవడంతో పండించిన పంటను విక్రయిం చేందుకు తిప్పలు తప్పడంలేదు. పత్తిపంటను విక్రయించాలంటే సీసీఐ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకాలు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌ల



కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ములుగు బ్యాంకు పరిధిలో..

ములుగు జిల్లా సహకార బ్యాంకు పరిధిలో రూ.28.14 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. అందులో రూ.73.59 కోట్ల రుణాలు ఉండగా వాటిని 1,821 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు తాకట్టు పెట్టుకుని అధికారులు రుణాలు మంజూ రు చేశారు. మొత్తం సహకార బ్యాంకులో 19,500 మందికి ఖాతాలు ఉన్నాయి. రూ.100 కోట్లతో బ్యాంకు బిజినెస్ కలిగి ఉంది. ములుగు సహకార బ్యాంకు పరిధిలో వెంకటాపూర్, ములుగు, గోవిందరావుపేట, నర్సాపూర్ పీఏసీఎస్‌లు ఉన్నా యి. ములుగు పీఏసీఏస్‌లో 6,630 మంది రైతులు ఉండగా వారిలో 1,799 మందికి రూ.14,79,66,403 పంట రుణాలు అందజేశారు. అలాగే వెంకటాపూర్ పీఏసీఎస్ పరిధిలో 3,664 మంది రైతులు ఉండగా అందులో 1,165 మంది రైతులకు రూ. 8,29,86,163లను రైతులకు పంట రుణం అందజేశారు. గోవిందరావుపేట పీఏసీఏస్ పరిధిలో 3,440 మంది రైతులు ఉండగా అందులో 556 మందికి పంటరుణం రూ. 3,90,65,400 అందజేశారు. నర్సాపూర్ పీఏసీఏస్ పరిధిలో 1,446 మంది రైతులు ఉండగా అందులో 398 మందికి పంట రుణం కింద రూ. 3,39,13,873 రుణం అందజేశామని సహకార బ్యాంకు మేనేజర్ ఇంజపెల్లి తిరుపతి పేర్కొన్నారు. ఐదేళ్ల క్రితం వరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకుండానే సహకార బ్యాంకులో రుణాలు అందజేసేవారమని, కానీ ప్రస్తుతం కొత్త నిబంధనల మేరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నిబంధనల లోబడే రుణాలు



కొత్తగా రుణాలు పొందే రైతుల పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని రుణాలు ఇవ్వాలని ఉన్నతాధి కారులు సర్క్యులర్ జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే రుణాలు ఇస్తున్నాం. రైతులు జిరాక్స్ తీసుకునేందుకు అవసరముంటే వారికి పాస్‌పుస్తకాలు అందజేస్తున్నాం.

- తిరుపతి, సహకార బ్యాంకు మేనేజర్ (ములుగు)

జిల్లా గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి : చైర్మన్ రవిచందర్


సమావేశంలో మాట్లాడుతున్న రవిచందర్

ములుగు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని గ్రం థాల యాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌ను కోరారు. మంగళ వారం హైదరాబాద్‌లోని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కేంద్రంలో రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ ఎమ్డీ.రియాజ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా రవి చందర్ మాట్లాడుతూ ములుగు జిల్లా గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత ఉన్నందున ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సిబ్బందిని నియమిం చాలని, గ్రంథా లయాల నిర్వహణకు నిధులు కేటాయించడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో

ములుగు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో పాణిని అన్నారు. ములుగు మండలంలోని కోయగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వ హించాలన్నారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధిం చాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రామచంద్రాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామ ర్థ్యాలను పరిశీలించారు.

'సమగ్రశిక్షా ఉద్యోగుల సమ్మె తాత్కాలిక విరామం మాత్రమే'

ములుగు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె తాత్కాలిక విరామం మాత్రమేనని జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 28 రోజులపాటు సమ్మె చేపట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క సోమవారం స్టేట్ ప్రాజెక్టు అధికారితో చర్చలు జరిపారని, డిమాండ్లను పరిష్కరించి నాన్ ఫైనాన్షియల్ అంశాలను పరిగణలోకి తీసుకుని 20 రోజుల్లో జీవో ఇస్తామని, పేస్కేల్ సబ్ కమిటీ దృష్టిలో ఉందని, అదికూడా వచ్చే బడ్జెట్ సమావేశంలో కేటాయించి సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో నిరవధిక సమ్మెను తాత్కాలిక విరామం చేయడం జరిగిందని, సమస్యలను పరిష్కరించనట్లయితే సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించార

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ములుగు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో నాయకులు, అంగన్‌వాడీలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు బండారుపల్లి రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్డీ.అమ్జద్‌పాషా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం అందించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదబీమా రూ.15లక్షలు అందించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, నాణ్యమైన సరుకులు సెంటర్లకు అం దించాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,500 వేతనం అందించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కె.రాజేందర్, ఇంజం కొమురయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణకుమారి, మీనాకుమారి, అంగన్‌వాడీలు, హెల్పర్లు సమ్మక్క, పార్వతి, రోజారాణి, అరుణకుమారి, సీత, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుభాషిణి పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంపై దాడి అమానుషం : బీజేపీ

గోవిందరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి అమానుషమని, ఈదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మార్క సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజాపాలన కాస్త ప్రజారోదనగా మారిందని, ప్రజల దృష్టిని మరల్చడానికి రేవంత్ ప్రభుత్వం రోజుకో కొత్త నాటకాన్ని తెరపైకి తెస్తున్నారని అన్నారు. వీధి రౌడీల్లా రెచ్చిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. దాడిచేసిన వ్యక్తులను వెంటనే అరెస్టుచేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

జీవో 3కు చట్టం చేయాలి

వెంకటాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జీవో 3కు చట్టం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉయిక శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తాటి సాంబశివరావు14వ వర్ధంతి జరగగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సాంబశివరావు ఆదివాసీ సమాజం కోసం పాటుపడ్డారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. ఈనెల 20వతేదీన ఏటూరు నాగారం ఐటీడీఏ ఎదుట జీవో 3కు చట్టం చేయాలని నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయ కులు వెంకటేశ్వర్లు, అర్జున్, సమ్మయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

వెంకటాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి ఎదిర గ్రామం వరకు చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులు కేటాయించినా నేటివరకు పనులు పూర్తికాలేదని అన్నారు. రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణం చేయడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని అన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు రోడ్డుపై లేచే దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాయకులు తాటి రాంబాబు, రాజ్‌కుమార్, అర్జున్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ


రథయాత్రలో ఎమ్మార్పీఎస్ నేతలు

మహదేవపూర్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమ లు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మహదే వపూర్ మండల కేంద్రంలో ఎమ్మా ర్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో కళాకారుల రథయాత్రను మంగళవారం సాయంత్రం నిర్వ హించారు. ఈసందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయ కుండా వర్గీకరణ చేనపట్టాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడే వారి దుమ్ము దులుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి, సీనియర్ నాయకులు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బడి బయట ఉన్న పిల్లలపై సర్వే ప్రారంభం

భూపాలపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చదువుకోని పిల్లలను బడిలో చేర్పించేందుకు బుధవారం నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబరు 12న ప్రారంభించి జనవరి 11వరకు ముగిం చాల్సి ఉండగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కారణంగా జనవరి 8 నుంచి మా సాంతం వరకు కొన సాగించనున్నట్టు పేర్కొన్నారు. బడి బయట ఉన్న పిల్లలను వెతికి వారి వయస్సును ఆధారంగా ఆయా తరగతుల్లో చేర్పించనున్నట్టు తెలిపారు.

భూపాలపల్లిలో 2,77,982 మంది ఓటర్లు

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలో 2,77,982 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు తుది జాబితాను ఆయన వెల్లడించారు. నియోజక వర్గంలో 1,36,952 మంది పురుషులు, 1,41,022 మంది మహిళా ఓటర్లు, 08 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ


మంత్రి నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మల్హర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ట్రస్మా ఏరియా కమిటీ ఆధ్వర్యంలో కాటారంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీల్లో కొయ్యూర్‌లోని దేవి విద్యోదయ విద్యార్థులు రెండు బహు మతులు సాధించారు. బాలికల కబడ్డీ సబ్ జూనియర్ విభాగంలో మొదటి బహుమతి, ఖోఖో బాలుర విభాగంలో రెండో బహుమతిని మం గళవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందు కున్నారు. పాఠశాలకు రెండు బహు మతులు రావడం పట్ల పాఠశాల కరస్పాం డెంట్ రాజు ఆనందం వ్యక్తం చేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్హర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ గ్రామానికి చెందిన బొమ్మ వీరమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఆయర వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు తాజుద్దీన్, అయ్యుబ్ ఖాన్, శనిగరం రమేష్ ఉన్నారు.

అపరాల సాగుతో అధిక లాభాలు

టేకుమట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అపరాల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందొచ్చని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి అన్నారు. అఖిల భారత సమన్వయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఆరెపల్లి, రాఘవరెడ్డిపేట గ్రామాల్లో క్షేత్ర దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆయన కంది పంటలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ అపరాలైన కంది, పెసర, మినుము పంటల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సంధ్యకిషోర్, మధు, వీరన్న, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. మరోవైపు జిల్లా నుంచి 250 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని అన్నారు. అనంతరం వివిధ కంపెనీలకు ఎంపికైన నిరుద్యోగ యువతకు మంత్రి సీతక్క నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, సీజీఎంఎం స్పెషల్ కమిషనర్ సీఈవో బి.షఫీవుల్లా, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఎల్‌డీఎం జయప్రకాశ్, జిల్లా అధికారులు, పలు కంపెనీలకు చెందిన సీఈవోలు పాల్గొన్నారు.

పోలీసులు మానసికంగా దృఢంగా ఉండాలి

ములుగు (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధినిర్వహణలో సక్సెస్ కావాలంటే శారీరకంగానే కాకుండా మానసికంగా దృఢంగా ఉండాలని, క్రీడలు ఇందుకు దోహదపడుతాయని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు మండలం జాకారంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నాలుగురోజులపాటు జరిగిన పోలీసు క్రీడోత్సవాలు మంగళవారం ముగిశాయి. సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ములుగు జిల్లా అభివృద్ధిలో పోలీసుశాఖ ప్రధాన భూమిక పోషించాలని కోరారు. వివిధ క్రీడా పోటీలలో 300మంది పురుష పోలీసు సిబ్బంది, 50 మంది మహిళా సిబ్బంది పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీశ్, ఏటూరునా గారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, ఓఎస్డీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న లక్ష్యాలను ఎంచుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఐదు మండలాల స్థాయి ఖేల్ ఉత్సవ్ క్రీడా పోటీలు ప్రారంభం కాగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజర య్యారు. క్రీడల నంద ర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ సమకూర్చిన క్రీడా దుస్తులను ఆవిష్కరించారు. అనంతరం క్రీడల కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచిం చారు. కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈకార్య క్రమంలో సీఐ మల్లేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడాధికారి చిర్రా రఘు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, స్వాగత్ కమిటీ అధ్యక్షుడు గంగాదర రాజు, ఏబీవీపీ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘుపతి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తా

భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో మంగళ వారం ఆవిష్కరించారు. ప్రభుత్వం ఇప్పటికే కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతితోపాటు జయంతి వేడుకను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అలాగే ఆయన గుర్తుగా విగ్రహాన్ని భూ పాలపల్లిలో ఏర్పాటు చేసేలా సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అడ్డగట్ల శ్రీధర్, నాయకులు ప్రసాద్, శంకర్, విక్రమ్‌సేన, రమేష్, శేఖర్ నాని, శ్రీను, అనిల్‌కుమార్, కుమారస్వామి, మహేందర్, సమ్మయ్య, శ్రావణ్, శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట


కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన 36మంది లబ్ధిదారులకు కల్యా ణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

ఎంజేపీ గురుకులం ఆకస్మిక తనిఖీ

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. తరగతిగదులు, వంట గది, గురుకులం చుట్టూ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ప్రధానంగా నీటి సమస్య ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మిషన్ భగీరథ డీఈ సంధ్యతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి నీటిని రెగ్యులర్‌గా ఇచ్చేలా చూడా లని సూచించారు. అనంతరం ఈడబ్ల్యూఐడీసీ ఏఈ జీవన్‌కు కూడా ఫోన్‌చేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎమ్డీ.రఫి, ఎంజేపీ గురుకుల ప్రిన్సిపాల్ శారద, కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, మండల రవీందర్, తక్కళ్లపల్లి రాజు, దండ వెంకటేశ్వర్‌రెడ్డి, నరహరి బక్కిరెడ్డి, బొల్లపెల్లి రాములు, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి వంద శాతం లక్ష్యాలను సాధించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశాడే సందర్భంగా ములుగు మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లి ఆరోగ్యం, పోషకాహారం, అసంక్రమిక వ్యాధుల నియంత్రణ, తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గర్భిణుల నమోదు సంఖ్యను పెంచి రక్తహీనత గల స్త్రీలను గుర్తించి వారికి ప్రత్యేకమైన వైద్యసేవలు అందించాలన్నారు. హైపర్ టెన్షన్, షుగర్ స్ర్కీనింగ్ టెస్టులు పూర్తి చేయాలని, టీబీ నియంత్రణలో ఆశా కార్యకర్తలు ప్రతినెలా పది తెమడ పరీక్షలు చేయించి గుర్తించబడిన టీబీ వ్యక్తులకు మందులు అందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను, టీకాల పట్టికను ఇచ్చే ప్రాంతంలో తీసుకోవాల్సిన నియమ నిబంధనలు, తదితర విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి విపిన్‌కుమార్, జిల్లా శిశు సంరక్షణ, వ్యాధిని రోధక టీకాల ప్రోగ్రాం అధికారి రణధీర్, వైద్యులు ప్రసాద్, అనిష్, ఇన్‌చార్జి డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పూర్ణ, సంపత్‌రావు, ఎంహెచ్ఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేషన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు దేవేందర్, నిర్మల, మేరీ, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా క్లినిక్ సందర్శన

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా క్లినిక్‌ను మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను తనిఖీ చేసి క్లినిక్‌కు వచ్చే మహిళా రోగుల వివరాలు, వైద్య సేవలపై ఆరా తీశారు. మహిళలకు వచ్చే గర్భాశయ సమస్యలు, థైరాయిడ్, హైపర్ టెన్షన్, గర్భాశయం క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి సిబ్బంది ఓపికతో సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం అధికారి రణధీర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రిషిత, ఇన్‌చార్జి డెమో సంపత్, హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు, హెచ్ఎన్ శోభ, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ సంఘమిత్ర, భవ్యశ్రీ, పుష్పకుమారి, ఫార్మసిస్టు రాజమణి, స్టాఫ్ నర్సు మున్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మంగపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా, మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కమలాపురం ఆటోస్టాండ్ వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన జశ్వంత్, శశికుమార్ ద్విచక్ర వాహనంపై మంగపేట వైపు బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై వెళ్తున్న క్రమంలో మంగపేటలో ప్రమాదం జరిగింది. ఆటోలో ఎనిమిది మంది కూలీలు ఉన్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న జశ్వంత్, శశికుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉందని ములుగు ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ సహా పలవురు కూలీలు స్వల్పంగా గాయపడ్డారు.

భూపాలపల్లిలో రోడ్డు ప్రమాదం

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం వైపు నుంచి పరకాల వైపునకు వెళ్తున్న కారు మార్గం మధ్యలో రెడ్ సిగ్నల్ పడటంతో వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపటికి గ్రీన్ సిగ్నల్ పడి ముందుకు కదలగా సుభాష్‌కాలనీ వైపు నుంచి కృష్ణకాలనీ వైపునకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు వచ్చి ఢీకొన్నారు. దీంతో కిందపడిపోగా పట్టణంలోని టీటూక్వార్టర్స్‌కు చెందిన శివ అనే వ్యక్తికి కాలుకి తీవ్ర గాయమైంది. అతనితో ఉన్న కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన హర్ష అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు.